# అత్యాచారం

అయిదార్రోజులుగా తనను ప్రపంచంనుంచీ, ఆఖరికి తనకుటుంబం నుంచీ విడదీసిన ఆ సంఘటన పూర్వాపరాలను ఆలోచించుకోవాలనుకున్నా సాధ్యంకాలేదు అరుణకు. నిజంగా అదిజరిగి అయిదార్రోజులేనా అయింది? లేక, తనమెదడుకు ఆలోచించడం తెలీని శైశవంలో జరిగిందా? అలా జరిగింది తనకేనా? తనకే అయితే, తనెందుకు ఆలోచించలేక పోతోంది మరి? అది తనమూలంగా జరిగింది కాదు. తన భాగస్వామ్యం వున్నదీ కాదు. కనీసం తన తప్పులవల్లనో, పొరపాట్లవల్లనో జరిగింది కూడా కాదు. అందుకే దాన్ని గురించి తనేమీ ఆలోచించలేక పోతోంది. తనకేమాత్రం సంబంధం లేకుండా జరిగిన ఆ సంఘటన తన జీవితాన్నింతగా కుదిపి వేయడం ఎంత అన్యాయం! ఎంతదారుణం! అంత అన్యాయాన్ని 'న్యాయం' గా, అంత దారుణాన్ని 'సాధారణం' గా మార్చాలని చూడ్డం మరెంతఘోరం !

ఉదయం తనకు కాఫీ తీసుకొచ్చిన అమ్మతో కలసి నాన్న కూడా వచ్చారు. ఆయన ఎట్లా ప్రారంభించి, ఏమేం మాట్లాడారో జ్ఞాపకం లేదు కానీ, చేసిన సూచన మాత్రం మొద్దుబారిన తనమెదడును చీల్చుకొని లోపల ప్రవేశించగలిగింది! కేసు ఉపసంహరించుకుంటే తనను పెళ్ళి చేసుకోడానికి 'అతను' వొప్పుకుంటాడట. అలాచేయడమే మంచిదని లాయరూ, పోలీసు, అధికారులూ, ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాలవారూ, సలహాలిస్తున్నారట. కాదు కూడదని కేసు కొనసాగిస్తే, కేసు నెగ్గే అవకాశం లేకపోవడం అటుంచి, నెగ్గితే మనకు వచ్చే దేముంది? అతనికి శిక్ష పడితే పోయినమన పరువొస్తుందా? నిన్ను పెళ్ళి చేసుకోవడానికెవరైనా ముందుకొస్తారా?

మధ్య మధ్య అమ్మ కూడా కొన్ని మాటలందిస్తూ నాన్నకు సహకరించింది. గత్యంతరం లేని పరిస్థితిలో ఈ సర్దుబాటు చేసుకోక తప్పదని చెబుతున్నా, వాళ్ళు అప్పటికే చేసుకున్న 'సర్దుబాటు' ఆశ్చర్యం కలిగించింది. 'ఇంత గొడవ' జరగకపోతే,

అతనిలాంటి సంబంధం తమకు అందుబాటులోకి వచ్చేది కాదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. 'ఇంత గొడవ' అన్నమాటను అతని పరంగా ఉపయోగించినప్పుడొక అర్థాన్నీ, తనపరంగా ఉపయోగించినప్పుడొక అర్థాన్ని వ్యక్తం చేశారు. మొదటి అర్థం 'ఇంతగొడవ' కొంత మేలు చేసిందన్నదైతే, రెండోది 'ఇంతగొడవ చేశాక నిన్నెవరు పెళ్ళి చేసుకుంటారు?' అన్నది. ఇంత గొడవా తనవల్ల రాలేదనీ 'వాడి' వల్లే వచ్చిందనీ అమ్మా నాన్నే భావించక పోవడం ఎంతవిచిత్రంగా విషాదకరంగా వుందో! తనంతటతనుగా ఆ సంఘటనను జ్ఞాపకం చేసుకోలేకపోతున్నా అరుణకు ఇప్పుడు గాయం కెలికినట్టయింది. ఆ గాయం శరీరానికీ, అంతకన్నా ఎక్కువ మనస్సుకూ తగిలింది.

శారద బి.ఎ. లో తనక్లాస్‌మేట్. తను ఎం.ఎ. కోసం యూనివర్శిటీకి వెళ్లకముందు ఇద్దరూ తరుచుగా కలుసుకునేవాళ్ళు. వాళ్ళ ఇంటికి వెళ్ళడం తనకు అలవాటే. యూనివర్శిటీకి సెలవులు రావడంతో ఆరోజు శారద దగ్గరికి వెళ్ళాలనుకుంది. దూరదూరంగా పెద్ద పెద్ద పోర్టికోలతో బంగళాలుండే ఆ ఏరియాలో శారద వాళ్ళ ఇల్లు ఆరోలైన్లో ఆఖర్నవుంది. అప్పటికి సాయంత్రం ఆరయింది. గంటో గంటన్నరో కూచునివచ్చేద్దామనుకుంది. 'కాలింగ్ బెల్' నొక్కుతూనే శారద వాళ్ళ అన్న రమణారావు వచ్చాడు. "ఓ .... అర్రుణా? కమిన్" అని ఆహ్వానించాడు. అతను బి.ఎ.లో తనకు లెక్చరర్. మొదటి గదిలోకి వెళ్తూనే అతను అంతవరకూ చేస్తూవుండిన పనేమిటో అర్థమయింది. గ్లాసులూ, సీసా సర్దుతూ నవ్వాడు. తనూ నవ్వి, "శారద లేదా? " అనడిగింది. అతను కొంచెం తడబడుతూ "వుంది, వుంది. మేడపైన వుంది, వెళ్ళు" అన్నాడు. ఆ తడబాటు తను తాగుతున్నట్టు తెలీడం వల్ల వచ్చిందనుకున్నది. మెట్లెక్కి మేడపైకి వెళ్లింది. ఎవరూ లేరు! కోపమూ, అసహ్యమూ, అంతకంటె భయమూ కలగడంతో గబగబా మెట్లు దిగుతోండగా..... ఎదురుపడ్డాడు. మెట్లమీదుగా తనను ఈడ్చుకుంటూ లాక్కొని వెళ్తున్నప్పుడు కూడా ', దిగ్భ్రమ లో వుండి పోయింది. తన స్నేహితురాలి అన్న, ఒకప్పటి తన లెక్చరరే అట్లా మారి పోతాడని, ఊహించే అవసరం కూడా రాలేదు.

తనను బయటికి తోసి, 'వెళ్ళిపో...... వెళ్ళిపో' అంటూ తలుపేసుకున్న తర్వాత కానీ అర్థం కాలేదు. అయిదు నిమిషాల్లో ఎంతదారుణం జరిగిందో తల్చుకునే సరికి తను తట్టుకోలేకపోయింది. ఎంత తేలిగ్గా, ఎంత ఘోరంగా తనను అవమానించగలిగాడు వాడు! ఏడ్వకూడదనుకుంటూనే ఏడ్చేసింది. తనపై జరిగిన దౌర్జన్యాన్ని ఎదిరించలేని నిస్సహాయత జ్ఞప్తికి రావడంతో పాటు, వాడ్ని తిట్టడానికి సరైన తిట్లు కూడా దొరక్క నోటికొచ్చిన తిట్లను 'హిస్టీరికల్' గా అందుకుంది. తన చుట్టూ పదిమందీ చేరిందీ తెలీదు, వాళ్ళకు

తానేం చెప్పిందీ తెలీదు. "తలుపులు బద్దలు కొడతాం, తలుపులు తీస్తావా, లేదా?" ని కేకలు వెయ్యడమూ, తప్పని సరై తలుపులు తీసినవాడ్ని తన్ని పోలీసులకు ఫిర్యాదు చెయ్యడమూ, వాళ్ళొచ్చి వాడిని స్టేషనుకు తీసుకెళ్ళడమూ, తనను మెడికల్ టెస్టుకు పంపించడమూ,.... అన్నీ అర్థ చేతనావస్థలోని అనుభవాల్లా, దృశ్యాల్లా జ్ఞప్తికున్నాయి. చేతనావస్థలో చూసిందల్లా అమ్మా నాన్నల దీనమైన ముఖాలను.

పత్రికల్లో రోజూ ఎక్కడో చోట 'వివాహిత యువతిపై అత్యాచారం', 'అవివాహిత యువతిపై అత్యాచారం' వంటి వార్తలు చదివింది. అగ్రవర్ణాల వారు దళితులపై దాడిజరిపి, దళిత స్త్రీలపై అత్యాచారం జరుపుతారు. పోలీసుల్లు 'లాకప్' లోనో, గ్రామాలపైనో, గిరిజన తండాలపైనో దాడి జరిపి స్త్రీలపై అత్యాచారం జరుపుతారు. అరవయ్యేళ్ళవాడు ఆరేళ్ళ పాపపై, ఇరవయ్యేళ్ళవాడు అరవైయేళ్ళ ఆమెపై అత్యాచారం చేస్తారు. ఒక్క స్త్రీ పై అయిదారుగురు అత్యాచారం చేస్తారు. ఇలాంటి వార్తలన్నీ తను పత్రికల్లో చదివింది. అత్యాచారం జరిపిన వాళ్ళని అసహ్యించుకుంది. బాధితులపై జాలిపడింది. ఒక్కోసారి అటువంటి బాధితులకు పరిహారం చెల్లించాలని ప్రతిపక్ష రాజకీయనాయకులో, ప్రజాసంఘాలవారో డిమాండ్ చేయడమూ తెలుసు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం పరిహారం ప్రకటించడమూ తెలుసు. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసాకో, పిల్లల్ని పుట్టించాకో వేరేకట్నం పెళ్ళికి సిద్ధపడితే, మోసపోయిన యువతి మౌనపోరాటాలు చేయడం తెలుసు. ఆ పోరాటాలను, సామాజిక మార్పుకోసం పోరాటాలు జరిపేవాళ్ళు సమర్థించడం తెలుసు. ఆ మోసగాడినీ, ఆ మోసపోయిన యువతినీ భార్యభర్తలను చేయాలని ప్రయత్నించడం తెలుసు. ఇవన్నీ తెలుసుకానీ, వీటిని గురించి తెలిసిందేమీ లేదనిపిస్తోందిప్పుడు.

అంతకుముందు పత్రికల్లో రోజూ చదివిన వార్తలాగే తనపై జరిగిన 'అత్యాచారం' కూడా వచ్చింది. 'అవివాహిత యువతి' అన్న సంగతి పత్రిక మరచి పోలేదు. ఆ అవివాహిత యువతి ఎవరో కాక, తనే కావడం వల్లనే ఇంతకు ముందు తెలీని సంగతి ఇప్పుడు తెలిసింది. 'అత్యాచారం' జరిగిందనే వార్తే తప్ప, అత్యాచారానికి గురైన యువతి పరిస్థితిని గురించి యేమీ లేదు అందులో. ఆ యువతి 'వివాహితా' 'అవివాహితా' అన్న విషయాన్ని పట్టించుకున్నంతగా, ఆమె మానసిక పరిస్థితిని గురించి పట్టించుకో లేదు. అది ఏవిధంగా 'అత్యాచారమో' ఎంత 'అత్యాచారమో' ఇతరులెవరూ తెలుసుకునే అవకాశం లేదు. అత్యాచారాన్ని కేవలం సాంకేతిక మైనదిగా, పారిభాషిక పదంగా చెప్పడమే వుంది.

ఇంతకు ముందు ఇటువంటివార్తలన్నీ వచ్చినట్టే ఇదీ వుంది. అప్పుడెప్పుడూ తను ఇలా ఆలోచించలేదు. బాధితురాలికి పరిహారం కోరడం తప్పనిపించలేదు. "జరిగిందానికి

ఎవరేం చేస్తారు? పరిహారం అందడమైనా కొంతమేలే కదా? అందువల్ల ఆమెనెవరో ఒకరు పెళ్ళి చేసుకునే అవకాశం వుంది" అన్న సమాధానం వుంది అందులో. మోసపోయిన యువతి మౌనపోరాటాల్లో పాల్గొనడంలో కూడా తప్పుకనిపించలేదు. ఇంతకు ముందైతే, అత్యాచారం చేసిన వారితో పెళ్ళి జరిపించాలనే ఆలోచనలో కూడా తప్పుకనిపించేది కాదు. 'అంతకన్నా మరేం చేస్తారు?' అనుకునేది. ఇప్పుడు అమ్మా నాన్న అనుకుంటున్నట్టుగా 'ఆ అవకాశం కూడా అందరికీరాదు కదా' అనుకునే దేమో!

తనపైన జరిగిన 'అత్యాచారం'తో అత్యాచారమంటే ఏమిటో అర్థమయింది. నిజానికెవడో మగవాడు ఏదో అవకాశం దొరికినప్పుడు స్త్రీ పై జరిపే అత్యాచార క్రియలోనే అత్యాచారమంతా లేదు. సమాజంలో దాన్ని గురించి వున్న భావజాలంలోనే గొప్ప 'అత్యాచారం' వుంది. అత్యాచారం జరిపిన మగవాడికెటువంటి నష్టమూ లేదనీ, అత్యాచారానికి గురైన ఆడదానికే అంతా నష్టమనీ నమ్మడంలోనే, ఆ నమ్మకం కొనసాగేట్టు చూడ్డంలోనే అసలైన అత్యాచారం వుంది. ఈ నమ్మకం పైకి, స్త్రీకి జరిగే నష్టాలను వాస్తవిక దృక్పథంతో గుర్తిస్తున్నట్టు కనిపిస్తూనే, అంతకన్నా వెయ్యి రెట్లు ఆమెకు నష్టమూ, అవమానమూ కలిగే అవకాశం కల్పిస్తున్నది. ఈ నమ్మకం ఒక్కసారి స్త్రీని మోసగించి 'రేప్' చేసిన వాడికి, జీవితాంతం ఆమెను 'రేప్' చేసే అవకాశం కలిగిస్తున్నది! ఒక చిన్నవస్తువును దొంగిలిస్తే, వాన్ని తన్ని, కొట్టి చంపడానికి సైతం సిద్ధపడే సమాజం, అత్యాచారం జరిపిన వాడికే ఆ స్త్రీని ఇచ్చి వేస్తున్నది!

ఇప్పుడు అమ్మా నాన్నా, లాయర్లూ, ప్రజా సంఘాలవారూ ఇస్తున్న సలహాలకు తనే మాత్రం ఒప్పుకోదు. కేసుగెలవలేకపోవచ్చు, వాడికి శిక్ష వేయించలేకపోవచ్చు. కోర్టులో లాయర్ ప్రశ్నలు అవమానకరంగా వుండవచ్చు. ఇవేవీ, వాడిని పెళ్ళి చేసుకోవడమంత అవమాన కరమైనవి కావు. ఆమాటకొస్తే ఆ అవమానాలు తనవి కావు, సమాజానివి. వాడిని పెళ్ళి చేసుకుంటే మాత్రం ఆఅవమానం తనది. స్త్రీ లందరిదీ నేమో! వాడు తనను అవమానించడాన్ని ప్రశ్నించకపోగా, తనను తాను అవమాన పరుచుకునే హీనస్థితికి దిగజారలేదు.

ఈ నిర్ణయానికి వచ్చిన అరుణ కొంత సంతృప్తి తోకూడిననిట్టూర్పు విడిచింది. అవమానాన్ని అర్థం చేసుకున్న అరుణ ఇప్పుడు ఆత్మగౌరవాన్ని కూడా అర్థం చేసుకుంది.

★ ★ ★

## -- కథ గురించి. . .

1990 'ఆంధ్రజ్యోతి' దీపావళి ప్రత్యేక సంచికలో '<u>అయినా, ఫర్వాలేదు</u>' అన్న పేరుతో యీ కథ అచ్చయింది. ఈ కథకు 'అత్యాచారం' అన్న పేరు సరిపోతుందని ఆపేరు పెట్టాను.

కొంత కాలం కిందట మోసపోయిన యువతులు మౌనపోరాటాలు నడిపారు. విప్లవ సంఘాలు కూడా ఆ పోరాటాలను బలపరచాయి. ఏదో రకంగా ఆ 'మోసగాళ్ళ' ను మెడలువంచి ఆయువతుల్ని పెళ్ళి చేసుకునేలా చేయాలన్నది ఆ పోరాటాల లక్ష్యం. ఇటువంటి పోరాటాలు ఫ్యూడల్ పెళ్ళిళ్ళ కన్నా స్త్రీలను మరింత హీన స్థితికి దిగజార్చేందుకు తోడ్పడతాయనీ, అంతకన్నా వాళ్ళలో ఆత్మగౌరవ స్పృహను మేల్కొల్పడం అవసరమనీ సూచించడానికి యీ కథ రాసాను.

ఇందులో అరుణ కన్నా <u>రచయిత్త</u> ఎక్కువగా కనిపిస్తునట్టు ఎవరికైనా అనిపిస్తే అనిపించవచ్చు.